క్లుప్తంగా

నేడు ఇందుపల్లి పీహెచ్‌సీ భవనం ప్రారంభం

ఉంగుటూరు: మండలంలోని ఇందుపల్లిలో రూ.2 కోట్లతో నిర్మించిన నూతన పీహెచ్‌సీ భవనాన్ని బుధవారం ఎమ్మెల్యే వంశీమోహన్ చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు వైద్యాధికారి బి.శిరీష తెలిపారు. అధునాతన హంగులతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని బుధవారం ఉదయం 11 గంటలకు ప్రారంభిస్తారన్నారు.

9న చండీహోమం

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో ఈ నెల 9వ తేదీ శుక్రవారం అమావాస్యను పురస్కరించుకుని చండీ హోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ బోయిన భానుప్రదీప్ తెలిపారు. హోమంతో పాటు ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. హోమంలో పాల్గొనదలచే భక్తులు ఆలయ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

వసతుల కల్పనకు కృషి

కంకిపాడు: ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని జేసీఎస్ మండల చైర్మన్, కంకిపాడు ఉప సర్పంచ్ రాచూరి చిరంజీవి తెలిపారు. మండల కేంద్రమైన కంకిపాడు 7వ వార్డులో రూ.3.50 లక్షల పంచాయతీ నిధులతో చేపట్టిన సిమెంటు రోడ్డు పనులను మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం చిరంజీవి మాట్లాడుతూ.. ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు వేగంగా చేపడుతున్నామన్నారు. సుపరిపాలన అందిస్తున్న ప్రభుత్వానికి బాసటగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ధూళిపూడి కృష్ణకిషోర్, వార్డు సభ్యురాలు గాదంశెట్టి ఇంద్రాణి, బాకీ రాణి, స్థానిక యువత పాల్గొన్నారు.

చీరాల వెళ్లి పెన్షన్ అందజేత



విజయవాడ రూరల్: నున్న గ్రామ సచివాలయం - 3లో వలంటీర్‌గా పని చేస్తున్న కొడాలి ధనకొండ మంగళవారం బాపట్ల జిల్లా చీరాలలో ఆస్పత్రి నందు చికిత్స పొందుతున్న బత్తుల అన్నమ్మకు పెన్షన్‌ను అందజేశారు. అనారోగ్యంతో చికిత్స పొందుతున్నందున ప్రభుత్వం విడుదల చేసిన పెన్షన్ మూడు వేల రూపాయలు తనకు ఎంతో ఉపయోగకరమని లబ్ధిదారురాలు అన్నమ్మ ఆనందం వ్యక్తం చేసింది. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపింది. విజయవాడ రూరల్ మండలంలో 98.99 శాతం మంది లబ్ధిదారులకు వైఎస్సార్ పెన్షన్ కానుక అందజేశామని ఎంపీడీఓ ఎ.రమ్యశ్రీ తెలిపారు. మండలంలో 17,541 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం పెన్షన్లు విడుదల చేయగా 6వ తేదీ నాటికి 17,363 మందికి 5 కోట్ల 21 లక్షల 13వేల రూపాయలను అందజేశామని ఎంపీడీఓ చెప్పారు.

పేకాట శిబిరంపై దాడి

కంకిపాడు: పేకాట శిబిరంపై పోలీసులు మంగళవారం దాడి చేశారు. ఎస్‌ఐ తాతాచార్యులు తెలిపిన కథనం మేరకు.. కంకిపాడు పట్టణంలోని శివారు ప్రదేశంలో పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారంతో దాడి చేశామన్నారు. దాడిలో ఎనిమిది మంది జూదరులను అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. వారి వద్ద నుంచి రూ.16,700 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

శరవేగంగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ



వణుకూరులో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఆర్డీఓ రాజు, అధికారులు



గన్నవరంలో వివరాలు పరిశీలిస్తున్న తహసీల్దార్ పవన్‌కుమార్

పెనమలూరు: గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల వ్యాప్తంగా జగనన్న ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ శరవేగంగా కొనసాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు ఇచ్చిన జగనన్న ఇళ్ల స్థలాలను రిజిస్ట్రేషన్ చేస్తున్నామని ఆర్డీఓ డి.రాజు తెలిపారు. ఆయన మంగళవారం వణుకూరు గ్రామంలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ రాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా మండల పరిధిలో దాదాపు 11 వేలకు పైగా పేదలకు గతంలో ప్రభుత్వం ఇళ్ల స్థలాలు మంజూరు చేసి పట్టాలు ఇచ్చిందన్నారు. ఇప్పుడు ఇళ్ల స్థలాలను ప్రభుత్వమే రిజిస్ట్రేషన్ ఉచితంగా చేయిస్తోందని తెలిపారు. పెనమలూరు గ్రామంలో ఇప్పటికే రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైందని, వణుకూరు గ్రామ పరిధిలో ఉన్న 444 మంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ ప్రారంభించామని తెలిపారు. త్వరలో అన్ని ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ ఎంవీఆర్.కుమార్‌బాబు, డీటీ శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీ కోరా శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కేసరపల్లిలో పరిశీలన

గన్నవరం: కేసరపల్లి గ్రామ సచివాలయం-1లో జరుగుతున్న పేదల ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను తహసీల్దార్ ఎస్ఎస్. పవన్‌కుమార్ పర్యవేక్షించారు. ఇప్పటి వరకు జరిగిన రిజిస్ట్రేషన్ల వివరాలను, ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయంలోగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. సర్పంచ్ చేబ్రోలు లక్ష్మీమౌనిక, ఆర్ఐ ఉదయ్, రెవెన్యూ సిబ్బంది, బీఎల్వోలు పాల్గొన్నారు. అనంతరం కేసరపల్లి జెడ్పీ హైస్కూల్‌లోని పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ పరిశీలించారు.

రూరల్ మండలంలో..

గన్నవరంరూరల్: మండలంలోని గ్రామ సచివాలయాల్లో ఇంటి నివేశన స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ శరవేగంగా కొనసాగుతోంది. లబ్ధిదారులకు సమాచారం అందించి, సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు నిర్వహిస్తున్నారు. సూరంపల్లి పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి కోట సురేష్‌బాబు, వీఆర్వో కస్తూరి అర్జునరావు, సచివాలయం కార్యదర్శి రాజశేఖర్ రిజిస్ట్రేషన్లు చేశారు.

అసైన్డ్ సాగుదారులకు భూహక్కు పత్రాల పంపిణీ



భూ హక్కు పత్రాలు అందుకున్న లబ్ధిదారులతో ప్రజాప్రతినిధులు

గన్నవరం: దశాబ్దాలుగా అసైన్డ్ భూములు సాగు చేసుకుంటున్న పేదలకు శాశ్వత భూహక్కు కల్పించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి దక్కుతుందని ఎంపీపీ అనగాని రవి పేర్కొన్నారు. స్థానిక శాసనసభ్యుని కార్యాలయంలో మంగళవారం తెంపల్లికి చెందిన 14 మంది అసైన్డ్ భూముల సాగుదారులకు భూహక్కు పత్రాలను జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ.గౌసానితో కలిసి ఎంపీపీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అనగాని మాట్లాడుతూ.. పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందన్నారు. దీనిలో భాగంగా అసైన్డ్ భూములను క్రమబద్ధీకరించడం చారిత్రాత్మకమైనదని తెలిపారు. దీనివల్ల 20 ఏళ్లు పూర్తయిన అసైన్డ్ భూముల సాగుదారులకు సర్వహక్కులను ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. పేదలకు ఇంతగా మేలు చేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ప్రజలందరూ మద్దతుగా నిలవాలని కోరారు. సర్పంచ్ కొలుసు శిరీష, పార్టీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి జలసూత్రం రామ్మోహన్‌రావు, క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పోలిమెట్ల జయరాజు, పార్టీ నాయకులు బొమ్మారెడ్డి రాజశేఖర్‌రెడ్డి, గొన్నూరు సీమయ్య పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెనమలూరు: పోరంకి గ్రామంలో వ్యక్తి పురుగుల మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటనపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం పోరంకి బిస్మిల్లా బిర్యాని షాపునకు ఎదురుగా దాసరి దుర్గమ్మ భర్త దాసు(30), ఇద్దరు పిల్లలతో నివాసం ఉంటుంది. దాసు చికెన్ షాపులో పని చేస్తుండగా దుర్గమ్మ పూల వ్యాపారం చేస్తుంది. కాగా సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో దాసు మద్యంలో పురుగుల మందు కలుపుకుని తాగాడు. అపస్మారక స్థితిలో ఉండగా పక్కింట్లో వారు చూసి దుర్గమ్మకు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన ఆమె వచ్చి దాసును విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించింది. అక్కడ అత్యవసర వైద్య చికిత్స అందిస్తున్న క్రమంలో చికిత్స పొందుతూ దాసు మృతి చెందాడు. దుర్గమ్మ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

చోడవరం గ్రామ పంచాయతీ తనిఖీ



పెనమలూరు: చోడవరం గ్రామ పంచాయతీని కొత్తగా విధుల్లో చేరిన ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు మంగళవారం తనిఖీ చేశారు. గ్రామ పంచాయతీ పరిధిలో అమలు జరుగుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలను సమీక్షించారు. గ్రామంలో అభివృద్ధి పనులు, జమా ఖర్చుల వివరాలు పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. గ్రామంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈఓపీఆర్డీ కోరా శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సూరంపల్లిలో బాలల మేళా

గన్నవరంరూరల్: మండలంలోని సూరంపల్లి జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాలల మేళా నిర్వహించారు. విద్యార్థులకు పలు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. కోఆర్డినేటర్ సీహెచ్ ప్రభాకర్, హెచ్ఎం రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు



ఆకునూరులో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీసీఎంఎస్ చైర్‌పర్సన్ స్నిగ్ధ

ఉయ్యూరు: విద్యా వ్యవస్థలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పడమట స్నిగ్ధ అన్నారు. మండలంలోని ఆకునూరు ప్రభుత్వ పాఠశాలను మంగళవారం ఆమె సందర్శించారు. పాఠశాలలో విద్యా ప్రమాణాలు, ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలను పరిశీలించి విద్యావ్యవస్థలో ప్రభుత్వం చేపట్టిన మార్పులపై ఉపాధ్యాయులతో చర్చించారు. పడమట స్నిగ్ధ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ బడుల రూపురేఖలు మార్చారన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు ఇంటర్నేషనల్ బాకలారియేట్ విధానాన్ని అమలు చేసేందుకు శ్రీకారం చుట్టారని చెప్పారు. ఆకునూరు పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు రక్ష ఫౌండేషన్ తరఫున అల్పాహారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు మేరుగుమాల ఏసుబాబు, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ



తాడిగడపలో రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

పెనమలూరు: తాడిగడప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న సిబ్బంది పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఓటర్లకు ఎటువంటి ఇబ్బంది లేకుండా తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం ఉండే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ, మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్ సందర్శన

గన్నవరం: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని మంగళవారం తహసీల్దార్ ఎస్ఎస్.పవన్‌కుమార్ సందర్శించారు. పోలింగ్ కేంద్రంలోని బూత్‌ల్లో సదుపాయాలను ఆయన పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలోని వసతులపై అధికారులతో చర్చించారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఓటర్లకు ఎటువంటి అసౌకర్యం లేకుండా అవసరమైన అన్ని సదుపాయలను కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం



కుందేరులో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య బృందం

కంకిపాడు: జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరమని వక్తలు పేర్కొన్నారు. మండలంలోని కుందేరు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ కలకోట రాధిక ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజారోగ్య పరిరక్షణకు దోహదపడుతుందన్నారు.

ఉమెన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ నందిపాటి బిందుమాధవి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతానికి వైద్య సేవలు పూర్తి స్థాయిలో అందుబాటులోకి తేవటానికి సీఎం జగనన్న పాటుపడుతున్నారన్నారు. శిబిరంలో వైద్యులు సుధా ప్రసూజ, పూర్ణిమ, శివపార్వతి, ఆప్తాలమిక్ ఆఫీసర్ వి.వి.రాజేష్‌కుమార్ వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో కలకోట ప్రసాద్‌రెడ్డి, బి.నరేష్, రాచమళ్ల శ్యాంప్రసాద్, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో వైద్య సేవలు

పెనమలూరు: జగనన్న ఆరోగ్య సురక్ష పథకంతో అన్ని వర్గాల ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నామని డాక్టర్ సాయిలలిత అన్నారు. పెనమలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో క్షేత్రస్థాయిలో సర్వే చేయించి సంపూర్ణ వైద్య సేవలు అందిస్తోందన్నారు. వైద్య శిబిరాల్లో ఉచిత వైద్య పరీక్షలు చేయటమే కాకుండా మందులు కూడా ఉచితంగా అందజేస్తున్నామని చెప్పారు. గ్రామాల్లో ప్రజలందరూ జగనన్న వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా 300 మందికి పైగా వైద్య సేవలు అందించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ మంజుల, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

163 మందికి ఉచిత దంత వైద్యసేవలు



తాడిగడపలో వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు, సీఐ రామారావు

పెనమలూరు: తాడిగడప గ్రీన్ సిటీ ఆవరణలో మంగళవారం ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహించి 163 మందికి వైద్యసేవలు అందించారు. గ్రీన్‌సిటీ డెవలప్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో డాక్టర్ సుధా నాగేశ్వరరావు పిన్నమనేని పాలీ క్లినిక్ వైద్య శిబిరం నిర్వహించింది. తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, సీఐ టీవీవీ రామారావు శిబిరాన్ని ప్రారంభించారు. దంత వైద్య నిపుణులు డాక్టర్ శ్రీకాంత్, జి.ఎం.నాయుడు బృందం 163 మందికి ఉచిత దంత వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. గ్రామాల్లో దాతలు ముందుకు వచ్చి వైద్యశిబిరాలు నిర్వహించటం వలన ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రీన్ సిటీ కమిటీ అధ్యక్షుడు అయినవరపు శేషగిరిరావు, ఉపాధ్యక్షుడు వరుడు నాగరాజు, గౌరవాధ్యక్షుడు అన్నాబత్తుల శ్రీనివాసరావు, ట్రెజరర్ తుమ్మల సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

జల్‌జీవన్ మిషన్ పనుల నిర్వహణపై శిక్షణ



మాట్లాడుతున్న ఎంపీపీ ప్రసన్నకుమారి

విజయవాడరూరల్: గ్రామ జల సంఘాల పేరుతో డ్వాక్రా గ్రూప్ మహిళలతో జల్‌జీవన్ మిషన్ పనులు నిర్వహించడం శుభపరిణామమని విజయవాడ రూరల్ ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పనుల నిర్వహణపై మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు తదితర పనులను మండలంలో మహిళలతో నిర్వహించడం వలన పారదర్శకత, మహిళా సాధికారితకు శ్రీకారం చుట్టినట్టు అవుతుందన్నారు. ప్రతి మహిళ ఈ పనులు నిర్వహించడంలో అనుభవం పొంది భవిష్యత్‌లో మరిన్ని పనులు సమర్థవంతంగా చేయాలని ఆకాంక్షించారు. ఎన్టీఆర్ జిల్లా కో ఆర్డినేటర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామ జల సంఘంలో 9 మంది డ్వాక్రా గ్రూపు సభ్యులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్, కార్యదర్శి ఉంటారని తెలిపారు.

ప్రతి పనికి సోషల్ ఆడిట్..

విజయవాడ రూరల్ మండలంలో 13 గ్రామాల్లో 43 కుళాయి కనెక్షన్లు ఇచ్చే పనులను మొదటి ఫేజ్‌లో చేపడుతున్నామని ఎంపీపీ చెప్పారు. పనులు నిర్వహించే గ్రూపులకు ఎస్టిమేట్స్‌లో 30 శాతం రివాల్వింగ్ ఫండ్‌ను మంజూరు చేస్తారన్నారు. మెటీరియల్ కాస్ట్‌తో ఈ గ్రాంట్‌కు ఎలాంటి సంబంధం ఉండదన్నారు. పనులు 70 శాతం పూర్తిచేసిన అనంతరం మరో 30 శాతం రివాల్వింగ్ ఫండ్ విడుదల చేస్తామని తెలిపారు. జల్‌జీవన్ మిషన్ పథకంలో చేసే ప్రతి పనికి సోషల్ ఆడిట్ ఉంటుందన్నారు. ఎంపీడీఓ ఎ.రమ్యశ్రీ మాట్లాడుతూ.. మండలంలోని నున్న, గొల్లపూడి, నిడమానూరు, ఎనికేపాడు, ప్రసాదంపాడు, రామవరప్పాడు, పైడూరుపాడు, రాయనపాడు, పి.నైనవరం, షాబాదు, జక్కంపూడి, పాతపాడు, అంబాపురం గ్రామాల్లో పనులు నిర్వహిస్తామని చెప్పారు. ఆయా గ్రామాల్లో జాయింట్ అకౌంట్‌లను బ్యాంక్‌ల్లో ఏర్పాటు చేస్తామని వెలుగు ఏపీఎం జి.చంద్రశేఖర్ తెలిపారు. ఈఓఆర్డీ బీఎల్‌వీ శేషగిరిరావు, రామవరప్పాడు సర్పంచ్ శ్రీదేవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్వేత పాల్గొన్నారు.

అభయాంజనేయ సన్నిధిలో అన్నదానం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం విశేష పూజలు, అన్నదానం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకుని తమలపాకులతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో 200 మంది భక్తులకు దాత రామాయణం రాఘవరాజు, మనీషా దంపతులు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. ఆలయ పాలకమండలి చైర్మన్ నెరుసు భూషణం, ఈఓ కూచిపూడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎన్నికల విధులు సమర్థంగా నిర్వహించాలి

కంకిపాడు: ఎన్నికల విధులను సమర్థంగా నిర్వహించాలని తహసీల్దార్ ఎం.రామకృష్ణ ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పోలింగ్ కేంద్రాల సిబ్బందితో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ రామకృష్ణ మాట్లాడుతూ.. మండలంలోని పలు గ్రామాల్లో 64 పోలింగ్ కేంద్రాలను సిద్ధంగా ఉంచాలన్నారు. బూత్ లెవల్ అధికారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులపై పరిశీలన చేయాలన్నారు. ఎన్నికల సంఘం సూచనలు పాటించాలని, బాధ్యతతో పని చేయాలని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

In the Court of the 11th Additional District Judge
at Gudiwada
G.W.O.P. No. 03/2024
(In the matter of appointment of the petitioner as guardian and for permission to sell the property of minor Veeranki Ratna Veera Venkateswara Rao, aged 17 years for sale)
Between :
Veeranki Naga Veera Pavan Kumar ... Petitioner
and
To Whom so ever it may concerned ... Respondent

పై నెంబరు G.W.O.P.No. 03/2024లో పిటీషనర్ తన మైనరుసోదరుడైన వీరంకి రత్న వీర వెంకటేశ్వరరావు తాలూకు స్థిరాస్తిని బయటలకు విక్రయించుటకు అనుమతించవలసినదిగా కోరియున్నారు. కావున పిటీషనర్ షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని విక్రయించుటకు ఎవరికైనా ఏవిధమైన అభ్యంతరములు గానీ, ఆక్షేపణలు గానీ, మొదలగునవి ఏమైనా వున్నయెడల ది. 07-03-2024 పై కోర్టు వారి యెదుట ఉదయం గం॥ 10-30 ని॥లకు స్వయంగా గానీ, లేక న్యాయవాది గారి ద్వారా గాని హాజరై తెలియచేయవలసినది.
షెడ్యూలు : కృష్ణాజిల్లా, ఉయ్యూరు సబ్ రిజిస్ట్రారు వారి ఇలాకా, ఉయ్యూరు మండలం, ఉయ్యూరునగర పంచాయితీ పరిధిలోని ఉయ్యూరు రెవిన్యూ గ్రామ రీ సర్వే నెం. 1048/2 నందలి చ.గ. 222.9లో డోర్ నెం.9-11, గ్రౌండ్‌ఫ్లోర్‌గా గల ఆర్.సి.సి. భవంతిలో ఉత్తరం వైపున అనిర్దిష్టపు, అవిభాజ్యపు 1/3వ వంతునకు రాగల చ.గ. 74.3 లు నివేశన స్థలము అందలి ఆర్.సి.సి. భవంతికి హద్దులు. **తూర్పు :** వీరంకి నీలకాంతేశ్వరరావు గారి ఆస్థి. **దక్షిణం :** వీరంకి పూర్ణచంద్రరావు గారి ఆస్థి. **పడమర :** వీరంకి సత్యనారాయణ గారి ఆస్థి. **ఉత్తరం :** జాయింటు బజారు.
వాయిదా తేదీ : 07-03-2024
ఇట్లు, పి. శ్రీరామ్ ప్రసాద్,
న్యాయవాది, ఉయ్యూరు. సెల : 81212 61853